క్లుప్తంగా

సీఎంఓను కలిసిన నాయకులు



సీఎంఓను అభినందిస్తున్న రాజేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల సీఎంఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్‌ను సోమవారం కొత్తగూడెం ఏరియా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.రాజేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణిలో పారదర్శకంగా మెడికల్ బోర్డ్ నిర్వహించాలని, జబ్బులున్న కార్మికు కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. అదే విధంగా రోగులకు సరైన వైద్యసేవలు అందించాలని, రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత



గొలుసు అందజేస్తున్న శోభన్‌బాబు

జూలూరుపాడు: మహిళ పోగొట్టుకున్న బంగారు గొలుసును ఓ యువకుడికి దొరకగా దానిని పోలీసుల సమక్షంలో అప్పగించాడు. మండలంలోని సురారం గ్రామానికి చెందిన బానోత్ లక్ష్మీ కొత్తగూడెం వెళ్లేందుకు సోమవారం జూలూరుపాడు బస్టాండ్ సెంటర్‌లో బస్సు కోసం నిరీక్షిస్తుండగా ఆమె మహిళ మెడలో ఉన్న రెండు తులాల బంగారు నల్లపూసల గొలుసు జారి కిందపడిపోయింది. ఈ క్రమంలో అన్నారుపాడు గ్రామానికి చెందిన కొమ్మినేని శోభన్‌బాబుకు గొలుసు దొరకడంతో పోలీసులకు అప్పగించాడు. ఈ మేరకు బాధిత మహిళను గుర్తించి ఎస్సై బాదావత్ రవి సమక్షంలో గొలుసును శోభన్‌బాబు ఆమెకు అందజేశాడు. దీంతో యువకుడికి లక్ష్మి కృతజ్ఞతలు తెలపగా ఎస్సై అభినందించారు.

పాఠశాలకు సౌండ్‌సిస్టం వితరణ



సౌండ్‌సిస్టం అందజేస్తున్న శ్రీనివాస్

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట ప్రాథమిక పాఠశాలకు బాలాజీ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ డైరెక్టర్ బత్తిని శ్రీనివాస్ సోమవారం సౌండ్ సిస్టంను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కబ్బాకుల రవి, కిన్నెర నర్సయ్య, కల్తి బుచ్చిరాములు, కుంజ రాంబాబు, పాడుగు సారయ్య, మహేందర్, పద్మారావు, గుండాల మల్లికార్జున్, స్వప్న, గాలి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితులకు పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న బానోత్ దుర్గా ప్రసాద్

జూలూరుపాడు: డయాలసిస్ బాధితులకు ప్రతీ నెల రూ.2,000 పింఛన్ ఇవ్వాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గా ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ... జూలూరుపాడు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని, కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ సెంటర్‌ను నెలకొల్పాలన్నారు. సమితి మండల అధ్యక్షుడు చరణ్ నాయక్, రాంబాబు పాల్గొన్నారు.

రేపు 'భూ భారతి'పై అవగాహన

జూలూరుపాడు: ఈనెల 23న జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 'భూ భారతి' చట్టంపై అవగహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.స్వాతిబిందు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ... బుధవారం ఉదయం 10.30 గంటలకు జరిగే అవగాహన సదస్సులో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పాల్గొంటారని, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిహారమే.. పరిహాసమై..

అధికారుల తీరుతో జీకే ఓసీ నిర్వాసితుల ఆందోళన

- పరిహారం చెల్లింపుపై రోజుకో మాట

ఇల్లెందురూరల్: దశాబ్దాలుగా నమ్ముకున్న భూమిలో పంటలు పండించుకుంటూ కొందరు.. సింగరేణి సంస్థపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవించిన మరికొందరు ఖాళీ స్థలాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ప్రశాంతంగా సాగుతున్న వారి జీవన ప్రయాణంలో జీకే ఓసీ విస్తరణ పనులు ప్రారంభంలో ఆందోళన కలిగించాయి. కానీ నిర్వాసితులందరికీ పరిహారం చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో ఆశలు రేకెత్తించాయి. అయితే, కాలం గడిచే కొద్ది అధికారుల మాటల్లో మార్పు వస్తుండడం నిర్వాసితుల ఆశలపై నీళ్లు చల్లుతోంది.

ముందస్తుగా సర్వే చేసి...

జీకే ఓసీ భూసేకరణలో భాగంగా మండలంలోని సీఎస్పీ బస్తీ పంచాయతీ సమీపంలో సర్వే నంబర్ 549 పరిధిలో 261.33 హెక్టార్ల భూభాగం సింగరేణికి అవసరమైంది. అందులో కొందరు రైతులు సాగు చేసుకుంటున్నట్లు గుర్తించి సర్వే ఆధారంగా సాగులో ఉన్న నిర్వాసిత భూభాగం 154 హెక్టార్లుగా నిర్ణయించారు. ఆర్డీఓ సమక్షంలో ఆర్‌వోఎఫ్ఆర్ గ్రామసభ నిర్వహించి నిర్వాసితుల జాబితాను ప్రకటించారు. కానీ సర్వే సమయంలో చోటుచేసుకున్న అక్రమాల కారణంగా అటవీశాఖ బీట్ అధికారిని



21 పిట్ ఏరియా వ్యూ

ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రీసర్వే చేసి నిర్వాసితులను ప్రకటిస్తామని చెప్పిన అధికారులు ఆ తరువాత అటుగా చూడటం మానేశారు.

పేదల ఆశలతో దోబూచులాట..

జీకే ఓసీ విస్తరణలో భాగంగా విజయలక్ష్మినగర్, తిలక్‌నగర్ నిర్వాసితుల కోసం సింగరేణి, రెవెన్యూ అధికారులు గత మార్చిలో సర్వే చేశారు. అయితే, స్థానికులు సర్వేను అడ్డుకోగా, నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇస్తామని, మౌలిక వసతుల కల్పనకు సింగరేణి సహకరిస్తుందని ప్రకటించారు. ఇలా మొత్తంగా 200 ఇళ్లు నిర్వాసిత జాబితాలోకి చేరగా.. ప్రస్తుతం అధికారులు మాట మార్చి పరిహారం ఇవ్వబోమని, ఇంటి నిర్మాణానికి వంద గజాల స్థలమే ఇస్తామని స్పష్టం చేస్తున్నారు. దీంతో ఆందోళనకు గురైన నిర్వాసితులు ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు తీస్తూ తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా సింగరేణి తీరును నిరసిస్తూ ప్రత్యక్ష ఆందోళనకు పూనుకోవాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

అధికారుల తీరు ఆందోళన కలిగిస్తోంది



సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు పరిహారం చెల్లిస్తామని గతంలో ప్రకటించారు. దశాబ్దాలుగా సాగులో ఉన్నది గిరిజన రైతులే అయినా మీకు సదరు భూమి ఎలా వచ్చిందో చెప్పాలని నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు సింగరేణికి అప్పగించేశామని తుదితీర్పు లేఖ చేతిలో పెట్టారు.

– ఎట్టి హరికృష్ణ, విజయలక్ష్మినగర్

ఆర్డీఓ ప్రకటనకు భిన్నంగా..

అధికారులు సర్వే చేసి నిర్వాసితుల జాబితా వెల్లడి కోసం ఏర్పాటు చేసిన సభలో ఆర్డీఓ స్వర్ణలత అటవీ, రెవెన్యూ భూమి ఎక్కడైనా రైతులు సాగు చేసుకుంటే గిరిజనులైనా, గిరిజనేతరులైనా పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. కానీ ఆ ప్రకటనకు భిన్నంగా క్షేత్రస్థాయిలో అధికారులు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. పూసపల్లి సమీపాన విజయలక్ష్మినగర్‌కు చెందిన గిరిజనులు సర్వే నెంబర్ 588/2 పరిధిలో 7.03 ఎకారల విస్తీర్ణంలో దశాబ్దాలుగా సాగు చేస్తుండగా భూములను అధికారులు సర్వే చేసి పంటలను కూడా పరిశీలించారు. కానీ ఇటీవల సదరు భూమి సాగుదారులకు ఎలా వచ్చిందో



రెవెన్యూ అధికారులు జారీ చేసిన నోటీసులతో సాగుదారులు

చెప్పాలని సూచిస్తూ నోటీసులు జారీ చేయడంతోపాటు భూమిని స్వాధీనం చేసుకొని సింగరేణికి అప్పగిస్తున్నట్లు తహసీల్దార్ తుది తీర్పు ప్రకటించారు. దీంతో భూమి కోల్పోవాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు.

మాట మార్చడం అన్యాయం

జీకే ఓసీ నిర్వాసిత సర్వే సమయంలో మెరుగైన ప్యాకేజీ ఇస్తామని చెప్పారు. ఇంటికి బదులు ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ నేడు ఇంటి నిర్మాణం కోసం 100 గజాల స్థలం మాత్రమే ఇస్తామని చెప్పడం అన్యాయం.

– తేజావత్ లాలు, విజయలక్ష్మినగర్

ప్రత్యక్ష పోరాటాలకు వెనుకాడబోం..

ఇల్లెందురూరల్: ప్రజల సహకారంతో జీకే ఓసీ విస్తరణకు అడుగులు వేసిన సింగరేణి అధికారులు పరిహారం చెల్లింపు సమయంలో మాట మార్చడం మోసం చేయడమేనని 21 పిట్ ఏరియా అఖిలపక్ష కమిటీ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు మండలంలోని 21 పిట్ ఏరియాలో సోమవారం అఖిలపక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్వాసిత ప్రాంత సమయంలో అధికారులు ఇచ్చిన హామీకి ప్రస్తుత కార్యాచరణకు సంబంధం లేకుండా ఉందని, పరిహారంగా వందగజాల స్థలం మంజూరు చేస్తామని అధికారులు చెప్పడం నిర్వాసితుల హక్కులను కాలరాయడమేనన్నారు. సింగరేణి అధికారుల నిర్ణయంలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని, న్యాయం జరిగే వరకు పోరాటాలకు వెనుకాడబోమన్నారు. ఈ సమావేశంలో నాయకు



సమావేశమైన నాయకులు

లు అబ్దుల్ నబి, పూనెం సురేందర్, మంచాల వెంకటేశ్వర్లు, వడ్డ శ్రీను, ధనసరి రాజు, ఎట్టి హరికృష్ణ, తేజావత్ లాలు తదితరులు పాల్గొన్నారు.

మిస్‌వరల్డ్ పోటీలను వ్యతిరేకిస్తూ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): మిస్‌వరల్డ్ అందాల పోటీలను వ్యతిరేకిస్తూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి గణేష్‌టెంపుల్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, రాష్ట్ర అధ్యక్షుడు కంపాటి పృథ్వీ మాట్లాడుతూ మహిళలను కించపరుస్తూ, విషసంస్కృతి పెంచేలా పోటీలను హైదరాబాద్ వేదికగా ఏర్పాటు చేయటం సిగ్గుమాలిన చర్య అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు స్పందించని ప్రభుత్వాలు ఇప్పుడు ఆద్యం పోసే విధంగా అందాల పోటీలు నిర్వహిస్తున్నాయన్నారు. వెంటనే అందాల పోటీ లను రద్దుచేయాలని, లేనిపక్షంలో అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కల్పన, జాటోత్ కృష్ణ, సావిత్రి, శివ, పెద్దబోయిన సతీష్, ధర్మా, రూప, సరోజ, ముత్తక్క, వెంకటమ్మ, దుర్గ, కే.భూలక్ష్మీ, మహేశ్వరి, ఎం రాజశేఖర్, రాయల సిద్దు, చంద్రశేఖర్, వీరభద్రం, కుంజా నాగమణి, పార్థసారథి గని, అబ్దుల్ పాల్గొన్నారు.

కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం



కవితను సత్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: కల్వకుంట్ల కవిత భద్రాచలంకు వస్తుండగా పాల్వంచ బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ మహిళా నాయకులు సింధు తపస్వీ ఆధ్వర్యంలో భారీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గజమాలతో కవితను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు అఖిల్, ఆసీఫ్, హర్ష, కిషోర్, లాకేష్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరం నేతాజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు నీరజ, శ్రీలక్ష్మీ, ప్రవీణ్‌లను సన్మానించారు. ఖయ్యూం, కృష్ణ, శంకర్, జానీ, రవీందర్, సురేష్, రాజేష్, శ్రీకాంత్, శ్రీను, రఘు, శ్రావణి, శ్యామల, అప్సర, రుబీనా, జాస్మిన్, రాజయ్య, కల్పన, జగదీశ్వరి, లలిత, సుజాత ఉన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో గురువులు, విద్యార్థులు

వర్షంతో అన్నదాతల్లో గుబులు



రెడ్డిగూడెంలో ఆరబెట్టిన ధాన్యం

- ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని వేడుకోలు

పాల్వంచరూరల్: అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నా అధికారులు మాత్రం ధాన్యం కొనుగోలు ప్రక్రియని వేగవంతం చేయడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో సొసైటీ ద్వారా ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇంతవరకు కేవలం రెడ్డిగూడెంలో మాత్రం ఏర్పాటుచేసి శుక్రవారం వరకు కేవలం రెండు లారీ ధాన్యాన్ని కొనుగోలు దాగోలు చేశారు. రెండు, మూడు రోజులుగా కొనుగోలు చేయడం లేదని, సోములగూడెంలో అసలు కొనుగోలు ప్రారంభించలేదని ఆయా గ్రామాలకు చెందిన ధాన్యం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్లల వద్ద ఆరబోసిన ధాన్యం వర్షాలకు తడవకముందే అధికారులు స్పందించి కొనుగోలు చేసి న్యాయం చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పన

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకల సౌకర్యాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి(సీహెచ్‌సీ)లో రూ.కోటి నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, డెంటల్, కంటి, ఓపీడీ, ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారితో బాధ్యతాయుతంగా వ్యవహరించి వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం డీసీహెచ్ఎస్ రవిబాబుకు ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు రావడంపై సన్మానించారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో జరిగిన పెన్షనర్స్‌డే వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. సమష్టి కృషితో రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని, పెన్షనర్స్ భవనంలో మీటింగ్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

తరగతి గది, టాయిలెట్లు ప్రారంభం..

పాల్వంచరూరల్: విద్యాలయాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించి ఉన్నతస్థానాలకు ఎదగాలని



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి కేశవాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో నవభారత్ సంస్థ నిర్మించిన అదనపు తరగతిగది, రెండు టాయిలెట్లను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఎంఈఓ శ్రీరాం మూర్తి, ఎంపీఓ బి.నారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ముత్యాల విశ్వనాథం, సీఎస్ఆర్ హెడ్ ప్రసాద్, లైజనింగ్ ఆఫీసర్ కదారేంద్రబాబు, ఏపీపీ రమేష్, హెచ్ఎం.హతీరాం, ఎస్ఎంసీ చైర్మన్ శైలాజ, ఉప్పుశెట్టి రాహుల్, గంధం నర్సింహారావు, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సీఎంపీఎఫ్ వేతన స్లిప్పులు



స్లిప్పులతో కార్మికులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఒప్పంద కార్మికులకు సీఎంపీఎఫ్ వేతన స్లిప్పులను ఏరియా జీఎం వి.కృష్ణయ్య సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022–23 సంవత్సరం వరకు తమ సీఎంపీఎఫ్ ఖాతాలో డబ్బులకు సంబంధించి ముగింపు మొత్తం స్లిప్పుల రూపంలో అందజేశామన్నారు. అనంతరం కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎంపీఎఫ్‌కు సంబంధించి రీఫైండ్ క్లెయిమ్స్ పొందిన వారికి పే ఆర్డర్లను అందజేశారు. ఈ సమావేశంలో ఏరియా అధికారులు గిరిధర్‌రావు, నర్సింహారాజు, మోహన్‌రావు, రవికుమార్, మధుబాబు, దిలీప్‌కుమార్, అంజిరెడ్డి, వెంకటేశం, సాయిస్వరూప్, అజయ్, గుర్తింపు సంఘం జనరల్ సెక్రెటరీ సారయ్య, ప్రాతినిధ్య సంఘం ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నబి

ఇల్లెందు: ఈ నెల 20న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, కర్షకులకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, కల్లేపల్లి మరియ, షేక్ ఫాతిమా, కటకం రాజయ్య, బోయిన పద్మ, బానోత్ భద్రు, పవన్ పాసి, హుస్సేన్, మోహన్‌రావు పాల్గొన్నారు.

పెసా చట్టంతో ఆదివాసీల అభివృద్ధి



మాట్లాడుతున్న దుగ్గి కృష్ణ

ఇల్లెందురూరల్: ఏజెన్సీలో పెసా చట్టం అమలుతోనే ఆదివాసీల అభివృద్ధి జరుగుతుందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు దుగ్గి కృష్ణ అన్నారు. మండలంలోని పూబెల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి తీసుకొచ్చిన పెసా చట్టాన్ని అమలు చేయడంలో పారదర్శకత లోపిస్తోందని, చట్టం అమలయ్యే విధంగా ఆదివాసీలు అవగాహనతో కలిసికట్టుగా నిలబడాలన్నారు. పూబెల్లి గ్రామ శివారులో ఉన్న తెల్లరాయి నిక్షేపాలను పెసీ చట్టంకు లోబడి వెలికితీసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి కిరణ్, నాయకులు వజ్జ సురేష్, కొడెం బోస్, ముత్యాలు, కల్తి శంకరయ్య, కల్తీ బుచ్చయ్య, బొల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం చేస్తాం



దీక్ష శిబిరంలో నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తాగునీరు, డ్రెయినేజీ, కరెంట్ సమస్య పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు హెచ్చరించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ బస్తీ, బూడిదగడ్డ గాజుల రాజం బస్తి ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రతరం అవుతుందని, అప్రకటిత కరెంటు కోతలు ఎక్కువగా ఉన్నాయని, క్రమబద్ధీకరణ పట్టాలివ్వాలని, డ్రెయినేజీ పూడికలు తీయాలని తదితర సమస్యలపై మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పట్టణంలోని పలు బస్తీల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉందనే చందంగా ఉందని, కిన్నెరసాని నీళ్లు 10 రోజులకు ఒకసారి వస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని, వెంటనే అర్హత కలిగిన వారందరికీ ఇళ్లు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అందని 'ఉపాధి' వేతనాలు

- రెండు నెలలుగా జమ కాక కూలీల ఇక్కట్లు
- పని ప్రదేశాల్లోనూ వసతులు లేవని ఆవేదన



కాల్వ పూడికతీత పనుల్లో ఉపాధి హామీ కూలీలు

సుజాతనగర్: ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందిపడుతున్నారు. ఫిబ్రవరి కంటే ముందు వరకు మాత్రమే డబ్బు ఖాతాల్లో జమ అయింది. ప్రతీ పదిహేను రోజులకోసారి కూలీల నగదు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా అలా జరగకపోవడంతో ఏ రోజుకారోజు పనికి వెళ్తే తప్ప పొట్ట గడవని నిరుపేదలు భారంగా కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

మండలంలో 6,573 జాబ్ కార్డులు

మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 6,573 జాబ్‌కార్డులు ఉండగా అందులో ప్రతీరోజు సగటున 2,600 కూలీలు పనికి వస్తున్నారు. పూడికతీత, ఫాం పాండ్స్, నర్సరీలు, హరితహారం, కాల్వలు తీయడం, చెరువులు, కాల్వల్లో పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపడుతున్నారు. అయితే, పని ప్రదేశాల్లో టెంట్ వేయించకపోగా, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా సమకూర్చడం లేదని కూలీలు వాపోతున్నారు. అంతే కాక వేసవి భత్యం మాటెత్తకపోగా కూలీ కూడా సక్రమంగా చెల్లించడం లేదని.. ఇకనైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



పని ప్రదేశంలో కనీస వసతులు ఉండడం లేదు. టెంట్, తాగునీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, మెడికల్ కిట్ అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నాం. అన్ని వసతులు కల్పించి కూలీ ఎప్పటికప్పుడు చెల్లించేలా చూడాలి.

– ఎస్.శైలజ, ఉపాధి హామీ కూలీ

డబ్బులు జమ కాలేదు



ప్రతీరోజు ఉపాధి పనులకు వస్తున్నా. ఇప్పటి వరకు కూలీ డబ్బు జమకాలేదు. ప్రతిరోజు ఆరా తీయడం, డబ్బు రాలేదని తెలిసి నిరాశ చెందుతున్నాం. దీంతో భారంగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వం స్పందించి డబ్బు చెల్లించాలి.

– పి.అన్నపూర్ణమ్మ, కూలీ